క్లుప్తంగా

చేనేత కార్మికుల హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

గంగాధర: గత ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన యారన్ సబ్సిడీ నిధుల విడుదలపై మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం నాటి బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు.

పర్యావరణాన్ని కాపాడాలి

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో పలుచోట్ల బట్ట సంచులు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో ప్లాస్టిక్ వినియోగించద్దని, ప్రభుత్వం సైతం భవిష్యత్ తరాల దృష్ట్యా ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సామాజిక అభిమానులు కారంకంటి రవీందర్, నరెడ్ల వినోద్‌రెడ్డి, ఆదిమూలం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్



గన్నేరువరం: గన్నేరువరం గ్రామ పంచాయతీ శివారులోని మఠం సమీపంలో గల పలుగు రాళ్ల వద్ద ఎలాంటి అనుమతి లేకుండా డంప్ చేసిన ఇసుకను బుధవారం సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారి రజినీస్‌కుమార్ తెలిపారు. సుమారు పది ట్రాక్టర్ల ఇసుక స్వాధీనం చేసుకున్నామని త్వరలో వేలం నిర్వహిస్తామన్నారు.

మత్తుపదార్థాలు వాడొద్దు

వీణవంక: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఎస్ఐ తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కూడలి వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల అమ్మకం, వాడకంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సుధగోని శ్రీజవర్షిణి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జీపీవీ రంగనాథశర్మ తెలిపారు. సీటు సాధించిన శ్రీజవర్షిణిని బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుర్రం అనసూయ, ఉపాధ్యాయులు నాగేందర్, అవదూత శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, ఆరిఫ్‌హుస్సేన్, రవీందర్, పద్మజారాణి, కరుణాకర్‌రావు, నల్లగొండయ్య, సరోజ, శంకరయ్య అభినందించారు.

చొప్పదండి: చొప్పదండి జిల్లా పరిషత్(బాలికల) పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎలిగేటి సవిత, గాలిపెల్లి అక్షిత, అనుమండ్ల నవీన బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను టీచర్లు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

చొప్పదండి: కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి అంబేడ్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో చొప్పదండి నుంచి బి. హరిచరణ్ (వీణాదరి), శ్రావణ్(శ్రీకృష్ణవేణి), జాన్వీ (ప్రాథమిక పాఠశాల), భువనేశ్వరి ప్రాథమిక పాఠశాల నుంచి ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడా అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 8న అంబేద్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని, బోనాఫైడ్, ప్రోగ్రెస్ కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు 5, మీ సేవా నుంచి తీసుకున్న పుట్టిన తేదీ సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రం వెంట తీసుకొని రావాలని సూచించారు.

40 ఏళ్ల సర్వీస్‌లో నో రిమార్క్

చొప్పదండి: 40 ఏళ్ల సర్వీసులో తనపై ఎలాంటి రిమార్క్ లేదని కొందరు నిరాధార ఆరోపణలు చేయడం బాధించిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విలేకర్లతో మాట్లాడారు. తాను ఎస్సీ విద్యార్థులకు ప్రవేశం నిరాకరిస్తున్నట్లు గిట్టనివారు తప్పుడు సమాచారం ఇవ్వడంతో కొందరు మండల స్థాయిప్రజాప్రతినిధులు ఆరోపణలు చేశారని, 300 పైగా విద్యార్థులున్నప్పటికీ ఈ విద్యా సంవత్సరం 100పైగానే హాస్టల్ విద్యార్థుల అడ్మిషన్లు ఇచ్చామని, ఇప్పటికీ ఇస్తూనే ఉన్నామని, పాఠశాలలో అటెండర్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సొంత డబ్బులు వెచ్చిస్తూ పాఠశాల నిర్వహణ కొనసాగిస్తున్నామని, రాత్రి వేళల్లో మద్యం సేవించి బాటిళ్లు పగలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలన్నింటిని డీఈవో, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

ఆదాయం వస్తున్నా..

- గంగాధర సబ్‌రిజిస్ట్రార్ సొంతభవనానికి మోక్షమెప్పుడో?
- రెండుసార్లు భూమి కేటాయించినా నిధులు మంజూరుకాని వైనం
- శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో కార్యాలయం నిర్వహణ
- తరచూ విద్యుత్ సమస్యలు, నిలుస్తున్న రిజిస్ట్రేషన్లు



గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

గంగాధర: రిజిస్ట్రేషన్ల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్న గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనంలేదు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడు అన్నట్టు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రెవెన్యూశాఖ స్థలాన్ని కేటాయించినా ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 32 ఏళ్ల క్రితం భవనానికి కేటాయించిన స్థలం ఎక్కడుందో అధికారులకే తెలియదు. సొంత భవనం నిర్మించడానికి రెండోసారి మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన స్థలాన్ని కేటాయించారు. మొదటిసారి గంగాధర చౌరస్తాకు సమీపంలోని సర్వేనంబర్ 965లో 12 గుంటల భూమిని కేటాయించారు. 11/1/1992లో అప్పటి కలెక్టర్ లేఖ నంబర్ బీ2/8511/91 ద్వారా 12 గుంటల స్థలాన్ని కేటాయిస్తూ కరీంనగర్ రెవెన్యూ డివిజన్ అధికారికి ఆదేశాలు జారీచేశారు. ఆర్డీఓ కార్యాలయం నుంచి లేఖ నంబర్ బీ/397/92 ద్వారా గంగాధర తహసీల్దార్ కార్యాయానికి ఆదేశాలు జారీ చేశారు. లేఖ నంబర్ బీ/947/92 ద్వారా సర్వేనంబర్ 965 లోని ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ తహసీల్దార్ కార్యాలయం నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ పంపారు. రెవెన్యూ శాఖ భూమి కేటాయించినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సొంత భవన నిర్మాణానికి నోచుకోవడంలేదు. సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోకి రామడుగు, గంగాధర, కొత్తపల్లి, చొప్పదండి మండలాల్లోని గ్రామాలు వస్తాయి. కార్యాలయంలో గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగేవి, ధరణి ఏర్పాటు తర్వాత వ్యవసాయ భూములు తహసీల్దార్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతిరోజు 20కిపైగా ప్రతినెల 500 మించి రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. గత ఆర్థిక సంవత్సరం 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు 8,471 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 26.41 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

అద్దెభవనంలో అవస్థలు..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మండల పరిషత్‌కు సంబంధించిన భవనంలో రూ.3,500 అద్దెతో నిర్వహిస్తున్నారు. దాదాపు యాభై సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. కొద్దిరోజుల క్రితం మరమ్మతులు చేయించినా సమస్యలు తీరడంలేదు. వర్షం కురిస్తే భవనంపై నీరు నిలుస్తుంది తద్వారా భవనం మొత్తం ఉరుస్తుంది. దీంతో రెండు మూడు రోజులకోసారి భవనంపై నీరు నిలువ కుండా చెత్తను తొలిగిస్తుంటారు. విద్యుత్‌వైరింగ్‌కు కాలం చెల్లడంతో పాటు తరుచూ లోవోల్టేజి సమస్యతో బ్యాటరీలు కాలిపోతున్నాయి. తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో కంప్యూటర్లు మొరాయిస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్లకు వచ్చే క్రయవిక్రయ దారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కంప్యూటర్లు మొరాయించి మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇలాంటి సమస్య తరుచూ ఏర్పడుతుందని సిబ్బంది, డాక్యుమెంటు రైటర్లు వాపోతున్నారు. భవనం చిన్నదిగా ఉండటంతో సిబ్బంది పనులు చేయడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు



రామడుగు: జెడ్పీటీసీ లక్ష్మీకిష్టారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీవో రాజేశ్వరీ



తిమ్మాపూర్: ఎంపీటీసీలు, జెడ్పీటీసీతో ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: పదవులు శాశ్వతం కాదని, ప్రజాభిమానం పొందాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల పదవి వీడ్కోలు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

ఇల్లందకుంట: ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

జమ్మికుంట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమత అధ్యక్షతన, ఎంపీడీవో భీమేశ్ ఆధ్వర్యంలో చివరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కోరపల్లి మహిళా సంఘాల డబ్బులను బ్యాంక్‌లో వేయకుండా స్వాహా చేస్తున్న సీఏపై చర్యలకు జాప్యం చేస్తున్న విషయంపై కోరపల్లి ఎంపీటీసీ 2 సభ్యురాలు కడవేరు మమత అధికారులను నిలదీశారు. పలు గ్రామల్లో సమస్యలు ప్రస్తావించారు. పీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్ రావు, ఎంపీటీసీలను సత్కరించారు.

గంగాధర: సమాజ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులది కీలక పాత్ర అని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్కం అనురాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ఎంపీపీ శ్రీరాం మధు, వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్ రెడ్డితో పాటు ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. ఐదేండ్లలో రూ. నాలుగు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

రామడుగు: ఎంపీడీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ మార్కొండ లక్ష్మీకిష్టారెడ్డి, ఎంపీపీ జవ్వాజీ హరీశ్, ఎంపీటీసీలను సన్మానించారు. తహసీల్దార్ భాస్కర్, సింగిల్‌విండో చైర్మన్లు వెంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎంపీపీ కేతిరెడ్డి వనితతోపాటు ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు. తిమ్మాపూర్ మండల చరిత్రలో ఎన్నడు లేని విధంగా జాతీయస్థాయిలో నానాజీ దేశముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ స్వస్తత వికాస్ నేషనల్ బెస్ట్ మండల్ అవార్డుతోపాటు రూ.2 కోట్ల ప్రైజ్ మనీ సాధించినట్లు తెలిపారు. నిధులతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ఉత్తమ మండలంగా రాష్ట్రస్థాయి అవార్డు కూడా సాధించిందని, ఎంపీపీ కేతిరెడ్డి వనితారెడ్డి మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పలువురు ప్రశంసించారు. అనంతరం ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలానికి జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి గొప్పదన్నారు. జెడ్పీటీసీ శైలజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల అభివృద్ధిలో అధికారుల సహకారం మరువులేనిదని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మా ట్లాడారు. ఐదేళ్లు అందరి సహకారంలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించానన్నారు. మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను చివరి సర్వసభ్య సమావేశంలో కోరామన్నారు. మండల అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. ఎంపీటీసీ గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు.

మానకొండూర్‌రూరల్: ఉద్యోగ విరమణ సహజమేనని ఎంపీపీ ముద్దసాని సులోచన అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నర్సయ్య ఉద్యోగ విరమణ, ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ...35 ఏళ్లు ప్రజలకు సేవచేయడం అదృష్టమన్నారు. ఈసందర్భంగా ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు ఎంపీడీవోను సన్మానించారు. తర్వాత ఎంపీటీసీ, ఎంపీపీలను అధికారులు, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

సాగుభూమికే ‘రైతుభరోసా’ ఇవ్వాలి

సైదాపూర్: ప్రభుత్వం ఐదెకరాల వరకే రైతుభరోసా ఇవ్వాలని సైదాపూర్ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం వెన్కెపల్లి సహకార సంఘం ఆవరణలో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రైతుభరోసా అమలుపై రైతులు సూచనలు చేశారు. సమావేశానికి వచ్చిన రైతుల్లో ఎక్కువ మంది ఐదెకరాలు, సాగు చేసే రైతులకే పెట్టుబడి సాయం అందించాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బందితో సర్వే చేసి సాగులో ఉన్న పదెకరాల వరకు ఇవ్వాలని మరికొంతమంది రైతులు అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు ఆడిట్ అధికారి మనోజ్‌కుమార్, సీనియర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సంఘం వైస్ చైర్మన్ కలకోటి కిషన్ రావు, ఏఈవో నిఖిల్‌కుమార్, సీఈవో శ్రీధర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం: సాగుచేసే వ్యవసాయ భూములకు రైతుభరోసా ఇవ్వాలని రైతులు సూచించారు. మండలంలోని తాడికల్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. పది ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలన్నారు. విండో చైర్మన్ మధుకర్‌రెడ్డి, సహకారశాఖ జిల్లా అధికారి మనోజ్‌కుమార్, శ్రీనివాస్, సీఈవో వీరస్వామి, వైస్‌చైర్మన్ రమణారెడ్డి, స్టాఫ్‌అసిస్టెంట్ వేణు, డైరెక్టర్లు, పాల్గొన్నారు.



చిగురుమామిడి: సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి

చిగురుమామిడి: సాగయ్యే వ్యవసాయభూములన్నింటికీ కొలమానం లేకుండా రైతుభరోసా అందించాలని సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. చిగురుమామిడి రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కార్యక్రమంపై రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండలవ్యవసాయాధికారి రంజిత్‌కుమార్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కరివేద మహిపాల్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ చిటుమల్ల శ్రీనివాస్, సీఈఓ నర్సయ్య, ఆయా గ్రామాలసింగిల్‌విండో డైరెక్టర్లు, రైతులు, తదితరలు హాజరయ్యారు.

నోటీసులిచ్చారు.. వదిలేశారు



శంకరపట్నం: కేశవపట్నం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న టేలాలు, షాపులను తొగించాలని రెండు నెలల క్రితం వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇంతలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అధికారులు పనుల ఒత్తిడితో తొలగించలేదు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తాడికల్‌లో తొగించినట్టుగానే కేశవపట్నంలో రోడ్డుకు దగ్గరగా ఉన్న టేలాలు, షాపులను తొలగించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయమై ఎంపీడీవోను వివరణ కోరగా ఆదివారంలోపు స్వచ్ఛందంగా తొలగించకుంటే సోమవారం సిబ్బందితో తీసివేయిస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జమ్మికుంట: టీపీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి సోదరుడు, జర్నలిస్ట్ విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం రాత్రి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వెంట నాయకలు దేశిన కోటి, పొనగంటి మల్లయ్య, గుడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, పూదరి రేణుకశివకుమార్, సాయిని రవి, శ్రీపతి నరేష్, సుంకరి రమేష్, సోల్లు బాబు, కొల్లూరి కిరణ్, రామరావు, సలీం, ముద్దమల్ల రవి ఉన్నారు.



నివాళి అర్పిస్తున్న కౌశిక్‌రెడ్డి, నాయకులు

వ్యాపారుల చేయూత



వాటర్‌ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న శివకుమార్

జమ్మికుంట: పట్టణంలోని మారుతినగర్ సాయి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం జమ్మికుంట వైభవ్ కాటన్ కార్పొరేషన్ యాజమానులు ముక్కా శివకుమార్, నారాయణ చేయూత నిచ్చారు. ఏడాదికి సరిపడా బియ్యం, ఇతర సరుకులు సమకూర్చామన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకడు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బుచ్చి రాములు, వైస్ ప్రెసిడెంట్ ముక్కా నారాయణ, కోశాధికారి సుత్రపు శాంతిదేవి, సభ్యులు పొనగంటి మల్లయ్య, పాఠశాల ప్రిన్సిపల్ బండారి రాజు, వ్యాపారులు శివవాక్కుని కిషన్, గర్రెపెల్లి వెంకన్న, తూర్పటి లింగయ్య, రాజగోపాల్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చొప్పదండి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎనిమిది నెలలుగా రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారని, పనులు ప్రారంభించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణశాఖ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, నాయకులు బత్తుల లక్ష్మీనారాయణ, చేపూరి సత్యనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, తోట కోటేష్, రాజన్నల రాజు, గొల్ల గట్టయ్య పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



గన్నేరువరం: గునుకులకొండాపూర్ నుంచి పీచుపల్లి, బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామాల మీదుగా ఖాసీంపేట వరకు రోడ్డుపై ఏర్పడి గుంతలను బుధవారం పూడ్చారు. రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారని గ్రామస్తులు తెలిపారు. ఖాసీంపేట, పారువెల్ల, మాదాపూర్, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరు, ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామాల ప్రజలు కరీంనగర్ వెళ్లడానికి రోడ్డు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయానికి వెళ్లే భక్తులు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పులి రమేశ్, సంతోష్, రాసూరి మల్లికార్జున్, పల్లె గంగారాం, గాదం మల్లికార్జున్, కుక్కల స్వామి, బెజ్జంకి అనిల్, పైడిపాల మల్లేశం పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు



దుక్కి దున్నే విధానం చూపిస్తున్న అధికారులు

జమ్మికుంట: సగుణ పునరుత్పాదకత వ్యవసాయంతో పంటల పరిరక్షణ, అధిక లాభాలు ఉంటాయని మహారాష్ట్ర సగుణ పునరుత్పాదకత వ్యవసాయరూపకర్త, రూరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ హరిబడ్స్యాలే అన్నారు. బుధవారం పట్టణంలోని కేవీకేలో సగుణ పురుత్పాదకత పద్ధతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో పర్యావరణానికి హానీ కలగడంతోపాటు పెట్టుబడి అధికమవుతుందన్నారు. పర్యవరణ హిత అధిక దిగుబడికి పనరుత్పాదకత పద్ధతి రూపొందించామన్నారు. దుక్కులు చేయకుండా భూమిని పరిరక్షించే శూన్య సాగుతో ఖర్చులు తగ్గించుకొని లాభాలు పొందవచ్చాన్నారు. కొత్త సాంకేతిక విషయాలపై రైతులు అవగాహన పొంది తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాస్, కేవీకే ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు, దుర్గాప్రసాద్, రిటైర్డ్ ఏడీఆర్ వరంగల్ రాంబాబు, పీడీ ఆత్మ చత్రునాయక్, సాక్షి రిపోర్టర్ ప్రియదర్శిని, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం సభ్యుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వండడానికి అధికారులు అనుమతించడం లేదని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రఘూన్సీ వీవో గ్రూపు మహిళా సంఘం సభ్యులు ఆందోళన చేశారు. వంట చేయడానికి అనుమతివ్వాలన్నారు.

మానసాదేవి ఆలయంలో కుంకుమార్చన

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలో బుధవారం త్రిశతి నామాత్మక సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీచక్రం వద్ద ప్రతిరోజు అర్చన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆలయ అర్చకులు పెండ్యాల అమర్‌నాథ్‌రెడ్డి శర్మ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు చెందిన భక్తులు కుంకుమార్చనలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అర్చకులు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

హామీలు అమలు చేయాలని వినతి

మానకొండూర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని, వెంటనే పథకం అమలు చేయాలని కోరుతూ బీజేపీ మహిళామోర్చా నాయకులు బుధవారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు మార్క సుమతి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం అమలు చేయాలని లేదంటే ఆందోళనలు చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో మహిళలు విజయ, మంజుల, జయలక్ష్మి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న మహిళలు